23

# కిస్సా కాపీకా

మనిషి పుట్టగానే పరిమళిస్తాడు. ఆ పరిమళం పక్కవాడిది తస్కరించాడన్న విషయం ఆ తర్వాత తెలుస్తుంది.

మనిషి బాల్యాన్ని ఎంతో మధురమైందిగా భావిస్తాడు. ఎందుకంటే వాడికి 'కాపీ కళ' అప్పటి నుండే అలవడింది కాబట్టి- నానమ్మ దగ్గర తమల పాకులు నమలడం, తాతలాగా చుట్ట తాగడం, మామలాగా మందు కొట్టడం, నాన్నలాగ అబద్ధాలాడడం, టీచర్ లాగా లేనిది ఉన్నట్లు భ్రమించుకోవడం.... ఇలా ఎన్నెన్నో చుట్టున్న ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ, మనిషి అద్భుతంగా బ్రైట్ కలర్స్‌తో ఎదుగుతాడు.

మనిషి చిన్న స్కూల్లో పరీక్షలు రాస్తున్నప్పుడు పక్కవాడి పేపర్లో చూసి రాయడం నేర్చుకున్నాడు. తలతిక్క పంతు లెవడైనా గొడవ చేస్తాడేమోనని! ఆ తర్వాత రాత్రంతా కూర్చుని తన నకలు చిట్టీలు తానే రాసుకు పొయ్యాడు. బస్ టికెట్ సైజ్ పేపరు మీద వెయ్యి అక్షరాలు రాయడం ఈ విధంగానే అభ్యసించాడు. (పెద్ద పెరిగి పోస్ట్‌కార్డ్ మీద ముప్పయి వేల అక్షరాలు రాసి, నిరుద్యోగపు దశలో 'గిన్నిస్' రికార్డు సాధించాడు.) ఈ దశలోనే అతనికి కొంటె చూపూ కంటిచూపూ పెరిగింది. హస్తలాఘవం అలవడింది. పట్టపగలు అందరూ ఉండగానే, గట్టి నిఘాలోనే అతను మెజీషియన్లా ఎక్కడి నుండి ఏ ఆన్సర్ తీసి రాస్తాడో ఎవరికీ తెలియదు. అదొక తెలివి. అదొక ప్రత్యేకమైన కృషి. అదొక వరం.

హైస్కూల్లో మనిషి తెలివి మరింత పెరిగింది. చిట్టీలు కన బడకుండా అట్టలమీదా, స్కేళ్ళమీదా, చేతిరుమాళ్ళ మీదా జవాబులు రాసుకు పొయ్యాడు. పరీక్ష హాల్లో అవి దిగ్విజయంగా ఉపయోగించు కున్నాడు. చిన్న కాలేజీకి వెళ్ళేసరికి వాడి మేధ అమోఘంగా తయా రయ్యింది. బనియన్ల మీద! చొక్కా చివరల మీద, ఫుల్ హాండ్స్ షర్ట్ చేతి మడతల్లో కూడా ఆన్సర్స్ ఎంచక్కా రాసుకు పోవచ్చని కనిపెట్టాడు. అదంతా వాడి ఇన్వెన్షనే! పరీక్షల్లో కాపీ కొట్టి పైమెట్టు ఎక్కి పోతూ వుంటే వాడి థ్రిల్ ఇంతా అంతా కాదు. "కాపీ కొట్టు-కాకపోతే, స్వంత తెలివిని నమ్ముకున్నవాడు ఈ దునియాలో ఎవడు బాగుపడ్డాడు గనుక?" అని సిద్ధాంతాన్ని కూడా ప్రతి పాదించాడు.

పెద్ద కాలేజీలో "కాపీకళ"ను మరింతగా ఉద్ధరించాడు! దాన్ని కళాత్మకంగా తెలివిగా, కొనసాగించాడు. హాల్ టికెట్స్ వెనక పాయింట్స్ రాసుకుపోవడం, చేతిమీదో, కాలిమీదో, బూట్ల సాక్స్ మీదో రాసుకుపోవడం లాంటి పద్ధతులున్నాయి గానీ, అవన్నీ తక్కువ రకంగా భావించాడు. ప్యాంట్ గీతల మధ్య, పరికిణీల మీద, చీర మడతల్లో, బురఖాల్లో సబ్జెక్ట్‌కు సంబంధించిన ముఖ్య విషయాలు రాసుకుపోయే వారిని చూసి, అదేమంత గొప్ప విషయం కాదను కున్నాడు. ఎందుకంటే అతను అవన్నీ పిన్నవయసులో చేసి మానేసి నవే! బాల్యాన్ని వదిలి పరి'పూర్ణ' మానవుడిగా రూపుదిద్దుకుంటున్న మనిషి, అంతకంటే ఉన్నతమైన పథకాలు రూపొందించుకున్నాడు. ఇన్విజిలేటర్లను, స్క్వాడ్ మెంబర్‌లను సునాయాసంగా నీళ్ళు తాగించే విధానాలు చాలా ఆలోచించాడు. టెలిఫోన్ నంబర్ల-పాకెట్ డైరీలో, కరెన్సీ నోట్లమీదా, పోస్ట్‌చెయ్యాల్సిన కార్డ్సు మీదా రాసుకు పోవచ్చుననీ అలాగైతే, ఈశ్వరుడే వాచరుడైనా పట్టుకోలేడనీ గ్రహించాడు- ఆల్‌జీబ్రా సూత్రాలు, రేఖా గణిత సిద్ధాంతాలు, కెమిస్ట్రీ

ఈక్వేషన్లు, జీవశాస్త్రపు పారిభాషిక పదాలు, వ్యాకరణ సూత్రాలు, నన్నయ, బాబరు, డార్విన్, సంవత్సరాలు, డిగ్రీలు, శాతాలు అన్నీ కలగా పులగంగా ఏది కావలిస్తే అది, సిగరెట్ల మీదా, సిగరెట్ పెట్టెల లోపలా రాసుకుపోవచ్చని ఈ మనిషే కనుగొన్నాడు. ప్యాంట్ జిప్ లోపల చిట్టీలు భద్ర పరుచుకుపోతే, నరమానవుడు కాదు గదా దేవదేవుడే దిగి వచ్చినా కనిపెట్టలేడని- మనిషి కని పెట్టాడు.

కాపీకొట్టడం అన్నది గౌరవప్రదమైన ప్రదర్శన కళ కాలేదు గానీ, ఒకవేళ అయివుంటే మనిషి తన కళలో జూబెన్ మెహతా అయ్యుండేవాడు. పండిత్ జాకీర్ హుస్సేన్‌లా వాయించేవాడు. గులాం అలీలా పాడి పారేసేవాడు. మనిషిలోని అద్వితీయమైన ఈ కళ మరుగునపడి ఉన్నందువల్లే, హిప్నటిస్టుల ఆటలు సాగుతున్నాయి.

మనిషి ఏక కాలంలో రెండు మూడు డిగ్రీలు సంపాదించ గలిగాడు. అయితే పి హెచ్ డి థీసిస్‌లు కూడా కాపీకొట్టి రాయొచ్చనని వార్తా పత్రికల్లో చదివాడు. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు' అని మనసులోనే మనిషి భక్తితో పులకించిపొయ్యాడు. "ఎంతో మంది విధ్వంసుల మధ్య తనెంతటివాడూ? అంతటి స్థాయికి ఎదగాలంటే తనూ ఇంకా కృషి చేయక తప్పదు"- అనే నిర్ణయానికి వచ్చాడు.

ఎంత మంది నవలలు కాపీకొట్టడంలేదూ? ఎంత మంది కవిత్వం కాపీ చేయడంలేదూ? ఎంతమంది సంపాదకులు కాపీ చేసి, సంపాదకీయాలు రాయడం లేదూ? ఎంతమంది ఆలోచనల్ని కొల్లగొట్టడం లేదూ? ఒకణ్ణి ఒకడు కాపీ కొట్టకుండానే మార్కెట్లోకి ఇన్ని ప్రోడెక్ట్స్ వస్తున్నాయా? కాపీకొట్టకుండానే సేవింగ్స్ పథకాలు రూపొందుతున్నాయా? కాపీ కొట్టకుండానే దేశ ఆర్థిక విధానాలు రూపొందుతున్నాయా?- అని, మనిషికి అర్థమయ్యే సరికి ఎంతో కాలం

పట్టలేదు. తన మీద తనకు గొప్ప నమ్మకం కలిగింది. ఆత్మ విశ్వాసంతో ప్రజాజీవనంలో అడుగు పెట్టాడు.

రానురాను మనిషికి మెదడువంచి పనిచెయ్యడం కష్టమైన పనిగా తోచింది. ఆలోచించగల వాణ్ణి జీతం బిస్కెట్లేసి సెక్రటరీగా నియమించుకున్నాడు. మండల స్థాయినుండి దేశస్థాయికి తిరుగులేని రాజకీయనాయకుడిగా పెరిగి పొయ్యాడు. కాపీ కొట్టడం తెలియని చవటలంతా ఊడిగం చేస్తూ జీవితాంతం కుళ్లిపొయ్యారు. అమ్ముడు పోయిన కవిగాడొకడు "కాపీబ్రహ" శీర్షికతో మనిషి జీవిత చరిత్ర రచించాడు. (ఇది 'కాపీబ్రహ్మ' ఉద్గ్రంథంలోంచి తస్కరించిన భాగమని.... తెలిసినా ఎవరికీ చెప్పవలదని మనవి!)

మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు....

○

జూన్ 1992